స్వయం ఉపాధి పథకాల మంజూరుకు ప్రాధాన్యం

- కౌలు రైతులు, పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ డెయిరీలు, పౌల్ట్రీ రంగాలకు త్వరితగతిన రుణాలు
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- వార్త 8వ పేజీలో...

కరుణించిన వరుణుడు

పలు మండలాల్లో వర్షం

- ఎండల నుంచి ఉపశమనం
- నారుమడులకు ఊపిరి
- అన్నదాతకు ఊరట

చోడవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): వేసవిని తలపించే ఎండలతో అల్లాడిస్తున్న వాతావరణం బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. వాతావరణ ప్రభావంతో మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. భారీ వర్షం కాకపోయినప్పటికీ రెండు గంటలకు పైగా ఓ మోస్తరుగా వర్షం కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. వేసవి స్థాయిలో ఎండల ధాటికి అల్లాడిపోతున్న స్థానికులకు వర్షం ఉపశమనం కలిగించింది.



చోడవరంలో వర్షం



కొత్తకోటలో వర్షం

నారుమడులకు ఊపిరిపోసిన వర్షం

మండలంలోని పలు ప్రాంతాల్లో కూడా బుధవారం వర్షం కురవడంతో నీరు లేక ఎండిపోతున్న వరి నారుమడులకు ఊపిరిపోసినట్టయింది. ఈ నెల మొదటి వారంలో ఐదు రోజుల పాటు కురిసిన వర్షాలకు చాలామంది రైతులు ఆకుమడులు చల్లుకున్న సంగతి తెలిసిందే. ఆ తరువాత నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో పాటు ఎండలు కూడా వేసవిని తలపించేలా కాస్తుండడంతో నారుమడులు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. దీంతో చాలామంది రైతులు ఆయిల్ ఇంజన్లు, మోటార్లతో ఆకు నారుమడులను తడుపుకుని కాపాడుకుంటున్నారు. అయితే వాతావరణం మళ్లీ అనుకూలించి వర్షం కురవడంతో నారుమడులకు ఈ వర్షం జీవం పోస్తుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




రావికమతంలో వర్షంతో ఊపిరి పోసుకున్న వరి నారుమడులు

కె.కోటపాడులో..

కె.కోటపాడు: మండల కేంద్రం కె.కోటపాడు, పరిసర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం వర్షం ... మిగతా 8వ పేజీలో

కోనాం నీరు విడుదల

చీడికాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): వరి ఆకుమడులు తడుపుకొనేందుకు కోనాం జలాశయం నుంచి నీరు విడుదల చేశామని ఆ శాఖ జేఈఈ సత్యనారాయణదొర బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 95.10మీటర్లు ఉందన్నారు. ఇన్‌ఫ్లో 10 క్యూసెక్కులు కాగా, హైలెవెల్ కాలువ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, దిగువ కాలువ నుంచి ఇప్పటికే లీకేజీ ద్వారా 50 క్యూసెక్కులు సాగు నీరు విడుదల అవుతుందని ఆయన తెలిపారు. ఈ సాగునీటితో వరి ఆకుమడులు తడుపుకొనేందుకు అవకాశం ఉంటుందని, ఈ సాగు నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



హైలెవెల్ కాలువ ద్వారా విడుదలవుతున్న సాగునీరు

ఎలమంచిలికి రూ.109 కోట్లు

మునిసిపాలిటీ తాగునీటి పథకానికి రూ.107 కోట్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.2 కోట్లు

- మునిసిపల్ శాఖా మంత్రి పి.నారాయణ వెల్లడి



7వ వార్డులో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, ప్రగడ నాగేశ్వరావు, తదితరులు

ఎలమంచిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీకి రూ.107 కోట్లతో తాగునీటి పథకం, రూ.2 కోట్లతో డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు మునిసిపల్ శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. బుధవారం ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, తదితరులతో కలిసి ఎలమంచిలి మునిసిపాలిటీలో పర్యటించారు. 7వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వారు మంత్రికి తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజును ఆయన ఆదేశించారు. అనంతరం స్థానిక గురవప్ప కల్యాణ మండపంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకువెళుతున్నామన్నారు. అంతకు ముందు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలపడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. నియోజకవర్గంలో టీడీపీ నేతలకు సరైన గుర్తింపు లేకుండా పోయిందని, ఎక్కడా లేని అన్యాయం ఇక్కడ నేతలకు, కార్యకర్తలకు ఎదురవుతోందని పార్టీ నాయకులు మంత్రి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీలో విలీనమైన తమ వార్డును విభజించి గ్రామ పంచాయతీగా మార్చు ... మిగతా 8వ పేజీలో



మంత్రి నారాయణను సత్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట జాంధానీకి గుర్తింపు తెస్తా

హోం మంత్రి వంగలపూడి అనిత

- 'పేట'లో చేనేత సొసైటీ సందర్శన

పాయకరావుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట జాంధానీ చీరలకు మంచి గుర్తింపు తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం మండలంలోని సత్యవరంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి అనంతరం పాయకరావుపేటలోని చేనేత సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీలో చేనేత మహిళా కార్మికులు మగ్గాలపై జాంధానీ చీరలు నేయడాన్ని, తయారైన జాంధానీ చీరలను పరిశీలించారు. అదేవిధంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సొసైటీ ఆర్థిక ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాయకరావుపేటలో ప్రసిద్ధిగాంచిన జాంధానీ చీరలు నేయడం శుభపరిణామన్నారు. పాయకరావుపేట చేనేత సొసైటీకి మంచిగా ఆర్డర్లు వస్తున్నా వర్కింగ్ క్యాపిటల్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని, పాయకరావుపేట చేనేత సొసైటీని ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు చిన్న పరిశ్రమగా ఉన్న దీనిని భారీ పరిశ్రమగా అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేస్తానన్నారు.



చేనేత కార్మికులతో హోం మంత్రి వి.అనిత

అదే విధంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతోపాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, క్లస్టర్ ఇన్ చార్జి వంకా వెంకటరమణ, పీఏసీఎస్‌ల అధ్యక్షులు దేవవరపు రాజబాబు, చిక్కాల శ్రీను, నాయకులు మలిపెద్ది వెంకటరమణ, ఎం.రమాకుమారి, గొల్లపల్లి నాగు, సొసైటీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఇంతవరకూ అందని జీతాలు



- అప్‌గ్రేడ్ అయిన యూపీ పాఠశాలల్లో నియమితులైన గ్రేడ్-2 హెచ్‌ఎంలకు కూడా...
- పోస్టుల కేటాయింపుపై గందరగోళం
- విద్య, ట్రెజరీ శాఖల మధ్య సమన్వయలోపం
- వచ్చే నెల కూడా కష్టమే...

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా గత నెలలో బదిలీ అయిన ఐదు వేల మంది ఉపాధ్యాయుల్లో దాదాపు 1,500 మందికి జూన్ నెల జీతాలు ఇంతవరకూ అందలేదు. కొత్తగా ఏర్పాటుచేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలలు, యూపీ నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జీతాలు రాలేదు.

నూతన సంస్కరణల అమలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 538 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుచేశారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను నియమించారు. అయితే కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు జీతాలు రావాలంటే సదరు పోస్టులు మంజూరుకావాలి. దీనికి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలి. ఆ తరువాత ఖజానా శాఖ పొజిషన్ ఐడీలు కేటాయించాలి. ఈ ప్రక్రియ ఇంతవరకూ పూర్తికాలేదు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంతోపాటు మరో నలుగురు టీచర్లను నియమించారు. ఈ పోస్టులను కూడా ప్రభుత్వం గుర్తించి ఆమోదించాలి. అప్పుడే జీతాల చెల్లింపునకు అనుమతి వస్తుంది.

అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 34 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడంతో గ్రేడ్-2 హెచ్‌ఎంలను అక్కడ నియమించారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు అంటే అప్పటివరకూ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు. కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల హెచ్‌ఎం పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరుచేయాలి. లేదంటే పదోన్నతి ద్వారా స్కూలు అసిస్టెంట్‌లను నియమించాలి. అప్పుడే హెచ్‌ఎంలకు జీతాలు వచ్చేందుకు అవకాశం వస్తుంది. 34 యూపీ పాఠశాలల హెచ్‌ఎం పోస్టులు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఉన్నాయి తప్ప గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు కాదు. వీరికి జీతాలు రావాలంటే పాఠశాల విద్యా శాఖ ప్రత్యేకించి పోస్టులు కేటాయించి, ఆ విషయాన్ని ఖజానా శాఖకు పంపాలి. కాగా ఈ ఏడాది జిల్లాలో మోడల్ ప్రాథమిక పాఠశాలలతోపాటు విద్యార్థులు పెరిగిన పాఠశాలల్లో టీచర్లను నియమించారు. గత నెలలో జరిగిన బదిలీల్లో ఈ ప్రక్రియ చేపట్టారు. విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాలల నుంచి ఎక్కువగా ఉన్న చోటకు పోస్టు బదిలాయింపు చేయాలి. దీనికి అనుగుణంగా కొత్తగా పాఠశాలలో నియమితులైన టీచర్‌కు పొజిషన్ ఐడీ కేటాయించాలి.

అయితే ఈ విషయంలో విద్యా శాఖ ముందుగా అప్రమత్తం కాలేదని టీచర్లు వాపోతున్నారు. ప్రధానంగా మండల విద్యాశాఖాధికారులు చొరవ తీసుకుని బదిలీపై వచ్చిన టీచర్లను రెండు కేటగిరీలుగా విభజించలేదని తప్పుబడుతున్నారు. రెగ్యులర్ పోస్టులోకి వచ్చిన టీచర్‌కు జీతం బిల్లు పెట్టేందుకు ఇబ్బంది లేదు. కొత్తగా ... మిగతా 8వ పేజీలో

కారిడార్ నిర్వాసితుల పాదయాత్ర

- రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్



పాదయాత్ర చేస్తున్న నిర్వాసిత రైతులు

నక్కపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసిత రైతులు తమకు సరైన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 10 కిలోమీటర్ల మేర బుధవారం పాదయాత్ర నిర్వహించారు. చందనాడ పంచాయతీ తుమ్మలపేట నుంచి చందనాడ, ఎన్.నర్సాపురం, ఉపమాక మీదుగా నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, రైతు సంఘం నాయకులు గంటా తిరుపతిరావు, తళ్లా భార్గవ్, తదితరులు నిర్వాసిత రైతులకు సంఘీభావం ప్రకటించి పాదయాత్రలో పాల్గొన్నారు. నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కారిడార్ గ్రామాల్లో భూములతో పాటు నివాస గృహాలు కోల్పోయే వారి కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన వారందరికీ రూ.25 లక్షలు చొప్పున పరిహారం ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ 8.9 లక్షలు ప్రకటించిందని, ఈ మొత్తంతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదన్నారు. ఈ ప్యాకేజీని తాము అంగీకరించే ప్రసక్తిలేదని నిర్వాసిత రైతులు స్పష్టం చేశారు. నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించి, రూ.25 లక్షలు ప్యాకేజీ ఇచ్చి, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయం చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలపై తహశీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్, జి.గోవిందరావు, ఆర్.పద్మ, కె.రాణి, అమ్మాజీ, మునలినాయుడు, అప్పలస్వామి, మంగ, దొరబాబు, రమేశ్, వెంకటేశ్, నాగేంద్ర, నానాజీ, శ్రీను, కృష్ణారావు పాల్గొన్నారు.

పంచాయతీల నుంచి రావలసిన సెస్ బకాయిలు రూ.30 కోట్లు

- ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రె కుమార్‌రాజు

నర్సీపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో పంచాయతీల నుంచి సెస్ బకాయిలు రూ.30 కోట్లు రావలసి ఉందని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రె కుమార్‌రాజు తెలిపారు. బుధవారం నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల నుంచి సెస్ బకాయిలు పేరుకుపోతున్నాయని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.30 కోట్లు బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని బీడీసీని, మాకవరపాలెం గ్రంథాయాలను సందర్శించారు. కోటవురట్ల గ్రంథాలయంలో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి దమయంతి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న బుర్రె కుమార్‌రాజు



అశోక్ గజపతిరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గోవా గవర్నర్‌గా అశోక్ నియామకం హర్షణీయం

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజును నియమించడం హర్షణీయమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం మర్యాదపూర్వకంగా అశోక్ గజపతిరాజును స్పీకర్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా అయ్యన్నమాట్లాడుతూ గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజును నియమించడం చాలా ఆనందం అనిపించిందన్నారు. 1983లో ... మిగతా 8వ పేజీలో

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం

- పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం



కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఎలమంచిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చార్జ్ షీటు దాఖలు చేసిన కేసుల్లో ట్రయల్ త్వరితగతిన పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని సీఐ ఉపేంద్ర, పట్టణ ఎస్ఐ సావిత్రిలకు సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా కళాశాలల్లో అవగాహన సదస్సులు చేపట్టాలన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచడంతో పాటు ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వై.లోవలో మరిడిమాంబ జాతర

రాంబిల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వై.లోవ గ్రామంలో శారదా నది అవతల ఒడ్డున గల మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది అవతల ఒడ్డున అమ్మవారి ఆలయం ఉండడంతో భక్తులు నదిలో బోటు సహాయంతో వెళ్లి దర్శించుకునేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ఎలమంచిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి కొత్తపాలెం వార్డులో ఇంటి వినియోగానికి సంబంధించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఆ శాఖకు చెందిన విశాఖ ఏడీఈ సత్యారావు తెలిపారు. గ్రామంలో డి.ఎ.నాయుడు అనే వ్యక్తి ఇంటి వినియోగానికి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతునట్టు గుర్తించామన్నారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

- అధికారులకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశం
- ఎలమంచిలి అతిథి గృహంలో 'జనవాణి' నిర్వహణ
- నాలుగు మండలాల నుంచి 112 మంది విచ్చేసి సమస్యలపై నివేదన



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో నియోజకవర్గ జనవాణి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు విచ్చేసి అర్జీలను సమర్పించారు. పలువురితో ఆయన స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యలకు పరిష్కారం చూపినప్పుడే ఈ కార్యక్రమానికి ప్రజాదరణ మరింత పెరగుతుందన్నారు. ఇందులో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఉదయం నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో 112 మంది అర్జీలను అందజేశారు. వివిధ శాఖల అధికారులతో పాటు కూటమి నాయకులు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, ఊటకూటి రమేష్, కొరారు శ్రీను, గుర్రాల శేఖర్, కర్రి ఝూన్సీ తదితరులు పాల్గొన్నారు.

పెదపల్లి రైతులు ఆందోళన చెందవద్దు

మునిసిపాలిటీ పరిధి పెదపల్లి పరిసర ప్రాంతాల్లోని రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం వీరంతా ఆయనను కలిసి సమస్యలను వివరించారు. పెదపల్లిలో రెవెన్యూ అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సర్వే ప్రారంభించారని ఎమ్మెల్యేకు వివరించారు. గత ప్రభుత్వం డ్రోన్‌తో చేసిన సర్వే లోపభూయిష్టంగా ఉందని, కూటమి ప్రభుత్వం దూరదృష్టితో ఆలోచనచేసి సర్వే ప్రక్రియకు పూనుకుందని ఆయనకు రైతులకు వివరించారు. రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. గ్రామస్థులు బొద్దపు శ్రీను, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టు ఎంపిక తీరుపై ఆందోళన

అచ్యుతాపురం రూరల్, జూలై 16, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ వర్కర్ పోస్టు నియామకంలో అవకతవకలు జరిగాయని, సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు, పలువురు మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. తిమ్మరాజుపేట అంగన్‌వాడీ పోస్టు ఎస్సీలకు కేటాయించడంతో ముగ్గురు దరఖాస్తులు చేసుకోగా, వారిలో ఎస్సీ కాలనీకి చెందిన పేద మహిళ మంత్రి సునీతకు గ్రామస్థులు, పెద్దలు అండగా నిలిచారు. అయితే ఇదే గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన వ్యక్తి భార్య అయిన ఈరిగల స్వర్ణ భారతి అనే ఎస్సీ అభ్యర్థినికి పోస్టు దక్కడంతో వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలమంచిలికి చెందిన ఈమె తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన బీసీవ్యక్తి రాపేటి గౌతమ్‌ను ప్రేమ వివాహం చేసుకుందని వారు తెలిపారు. ఎస్సీ పోస్టు బీసీల పాలయ్యిందంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. మంగళవారం గ్రామానికి వచ్చిన ఐసీడీఎస్ అధికారిణి ఇందిరాకుమారి విచారణ చేపట్టి స్వర్ణ భారతి పోస్టు న్యాయబద్ధంగానే జరిగిందని తేల్చారన్నారు. విచారణ సమయంలో లేని నివాస, కుల ధ్రువపత్రాలు ఒక్కరాత్రిలో ఎలా వచ్చాయంటూ అధికారులపై వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక హెచ్‌సీడీ శ్యామ్ స్పందిస్తూ గతంలో ఆమె తనభర్త ఇంటిపేరున దరఖాస్తు చేసుకోవడంతో బీసీ కులానికి చెందినవారు కావడంతో తిరస్కరించామన్నారు. తిరిగి తన సొంత ఇంటి పేరున మార్చడంతో గతంలో చేసిన విచారణ ఆధారంగా కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇవ్వగలిగామని తెలిపారు.

నాలుగోసారి నిలిచిన మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక

మునగపాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక నాలుగోసారి కూడా నిలిచిపోయింది. ముందుగా ప్రకటించిన విధంగా బుధవారం ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఎన్నిక అధికారిగా ఎలమంచిలి మండల పరిషత్ కార్యాలయ ఈవోఆర్డీ దీపికను నియమించడంతో ఆమె మునగపాక గ్రామ పంచాయతీకి విచ్చేశారు. వార్డు సభ్యులు ఎవరూ రాకపోవడంతో ఎన్నిక నిర్వహణ జరగలేదని దీపిక వెల్లడించారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు చెప్పారు.

గల్లంతైన మత్స్యకారుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

అచ్యుతాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన పూడిమడక శివారు కొండపాలేనికి చెందిన చోడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీనివాస వాడబలిజ సంఘం అధ్యక్షుడు చొక్కా అప్పారావు కోరారు. బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించి సంఘం తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. ఎర్రయ్య గల్లంతు కావడంతో ఆ కుటుంబం రోడ్డు పడిందని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పిరాది చంటిబాబు, ఒరుపుల జైశంకర్, ఉమ్మిడి అప్పారావు, గోసల రమణ, చేపల దేవుడు, ఒరుపుల మహేష్, వంక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వైసీపీకి పూర్వ వైభవం

- పార్టీ శ్రేణుల సమావేశంలో నూతన సమన్వయకర్త ధర్మశ్రీ



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి నియోజకవర్గంలో వైసీపీకి పూర్వ వైభవం తీసుకువస్తానని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియామకమైన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని మామిడివాడ గ్రామంలో గల తన సొంత నివాసంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి సారథ్యంలో పనిచేస్తానన్నారు. గతంలో వివిధ పదవులు చేపట్టిన అనుభవం ఉన్న తాను నియోజకవర్గంలోని నాయకుల సూచనల మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తానన్నారు. మామిడివాడలో పుట్టిన తనకు ప్రజలతో పరిచయాలు ఉన్నాయన్నారు. ఈనెల 20న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు తనకు బాధ్యతలు అప్పగించనున్నారని, ఆ తరువాత ప్రతి మండలంలో వారం రోజుల వ్యవధిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తానని చెప్పారు. పార్టీ శ్రేణులంతా తనకు అండగా నిలవాలని కోరారు. తొలుత ఆయన గ్రామ దేవత కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ సమావేశంలో ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, జడ్పీటీసీలు రాంబాబు, సోమసత్యంనారాయణ, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, నాయకులు పి.కిశోర్, బొద్దపు ఎర్రయ్యదొర, త్రినాథ్, గణపతి అచ్చియ్యనాయుడు, శంకరరావు, జి.శ్రీనుబాబు, కోన బుజ్జి, నెట్టిం సత్యనారాయణ, ఎన్.వి.సూర్యనారాయణ, కొవిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై పట్టణంలో అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, విద్యార్థులు

ఎలమంచిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులు మధ్యవర్తుల సహకారంతో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని న్యాయమూర్తులు సూచించారు. బుధవారం పట్టణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ మాట్లాడుతూ కేసులు సత్వర పరిష్కారానికి ఇదో చక్కని మార్గంగా పేర్కొన్నారు. దీనిపై అందరిలో అవగాహన కల్పించేందుకే ఈ ర్యాలీ చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి.స్పందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, న్యాయవాదులు వెంకట్రావు, పీవీ రమణ, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



సత్యవరంలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి అనిత



దివ్యాంగుడికి సుపరిపాలన కరపత్రం అందిస్తున్న దృశ్యం

ఎన్డీఏ పాలనలోనే గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

- హోం మంత్రి వంగలపూడి అనిత

పాయకరావుపేట రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని సత్యవరం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరును మహిళలు, వికలాంగులను, వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సుమారు రూ. 16 లక్షలతో ఉపాధి నిధులతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభించారు. ఊర కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం ఇచ్చామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభంకానున్నట్టు చెప్పారు. గత వైసీపీ పాలనలో రూ. 3 వేల ఇచ్చిన పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం ఒక్కసారి రూ. 4వేలకు చేసినట్టు వివరించారు. త్వరలోనే పేదలకు ఇళ్ల ఇస్తామన్నారు. నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు విద్యుత్ సమస్యతో పంటలు నీరందక ఎండిపోతుండడమే కాక ఇబ్బంది పడుతున్నట్టు హోం మంత్రి కి తెలిపారు. దీనిపై ఆమె విద్యుత్ శాఖ డీఈఈ, ఏఈఈలతో మాట్లాడి నిరంతరం విద్యుత్ సరఫరాకు ఆదేశారు. మోసం చేసి రూ. కోట్లాది రూపాయలతో పరారైన గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుపై బాధితులు హోం మంత్రిని కలిసి గోడు వెల్లబుచ్చారు. దీనిపై స్పందిస్తూ నిందితుడిపై చట్ట ప్రకారంగా కఠినంగా శిక్షించి న్యాయంచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చించలపు ప్రదీప్, యాళ్ళ వరహాలు, నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, లాలం కాశీనాయుడు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌లు దేవవరపు రాజుబాబు, చిక్కాల శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు దేవవరపు ఆనంద్, వంకా వెంకటరమణ, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, గొర్లె రాజుబాబు, చింతకాయల రాంబాబు, ఎం. రమాకుమారి, ఏనుగు చిన్నా, కీర్తి సీతారాం, పెదిరెడ్డి శ్రీరాములు, నాగేశ్వరరావు, లోవదొర, గొల్లపల్లి నాగు, మజ్జూరి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నిక వాయిదా

- ఎంపీటీసీ సభ్యుల గైర్హాజరు
- నేడు నిర్వహించనున్నట్టు ప్రకటన





ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నికకు సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు, ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఎన్నికల అధికారిణి మనోరమ, పక్కన ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారిణి కె.మనోరమ, ఎంపీడీవో సత్యనారాయణ ప్రకటించారు. మండలంలో మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, వీరిలో 16 మంది వైసీపీకి చెందిన వారు కాగా, మిగతా నలుగురిలో ముగ్గురు టీడీపీ, ఒకరు జనసేన పార్టీకి చెందిన వారున్నారు. అయితే ఉదయం 11 గంటల నుంచి ఎంపీపీ ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా, ఒక్క సభ్యుడు కూడా హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల అధికారిణి వేచి చూశారు. అప్పటికి కూడా ఎవరూ రాకపోవడంతో ఎన్నికను గురువారం నిర్వహిస్తామని ప్రకటించారు. ఎంపీపీ ఎన్నిక వాయిదా పడే అవకాశం ఉందని, తాత్కాలికంగా వచ్చిన ఎంపీపీ పదవిలో తానే కొనసాగడం కోసం ఎన్నికకు తన మద్దతుదారులు హాజరుకాకుండా చేసి వాయిదా పడేలా గోవిందరావు సన్నాహాలుచేస్తున్నట్టు 'ఆంధ్రజ్యోతి' ముందు గానే చెప్పిన విషయం తెలిసిందే. కాగా కూటమి ప్రభుత్వానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యులు కుక్కలూరి మంగ, సియ్యాదులవరహాలమ్మ, నకరబోయిన వెంకటలక్ష్మి, జనసేన పార్టీకి చెందిన ఎంపీటీసీ పేర్ల మాధవ్ కూడా ఎన్నికకు గైర్హాజరు కావడంపై పలువురు కూటమి నాయకులు విస్మయం చెందుతున్నారు. ఇలా చేస్తే పరోక్షంగా వైసీపీ నాయకుడికి మద్దతు ఇస్తున్నట్టు సంకేతాలు ఇచ్చినట్టు అవుతుందని పలువురు కూటమి నాయకులు అంటున్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

ఎస్. రాయవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ వృద్ధురాలి మెడలో బంగారుగొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌తో వచ్చి అపహరించి పరారైన ఘటన బుధవారం మండలంలోని జేవీపాలెం గ్రామంలో చోటు చేసుకొంది. జేవీ పాలెంకు చెందిన శాంత రాజులమ్మ గ్రామం నుంచి కారం మిల్లుకు ఎలమంచిలి వెళ్లారు. అక్కడ పనిపూర్తి చేసుకుని తిరిగి ఆటోలో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆటో దిగి, ఇంటికి వెళ్తుండగా, ఎదురుగా బైక్‌పై వస్తున్న ఇద్దరు ఆమె మెడలోని సుమారు ఆరున్నర తులాలు గల రెండు పేటల బంగారు తాడును బలవంతంగా తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితురాలు రాజులమ్మ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగా వంకా హరి



వంకా హరి

పాయకరావుపేట రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరానికి చెందిన వంకా హరి టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. వెంకటనగరం గ్రామ స్థాయిలో పార్టీపరంగా క్రియాశీలకంగా పనిచేస్తున్న హరిని హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు పార్టీ మండల యూనిట్ ఇన్ చార్జిగా నియమించారు.

జగన్నాథుడికి పూజలు



స్వామివారి ఊరేగింపులో భక్తులు

నక్కపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండవాక మత్స్యకార గ్రామంలో బుధవారం జగన్నాథస్వామికి పూజలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పత్యేకంగా తయారు చేసిన రథంపై స్వామి విగ్రహాలను అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మోరియ్య, పిక్కి నూకతాత, పిక్కి కోదండ, వెంకటేశ్, ఫైడిరాజు, కోడ రమణ, మైలపల్లి శాంతి ప్రసాద్ పాల్గొన్నారు.

నారుమళ్లలో యాజమాన్యంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ నాగేంద్ర ప్రసాద్

నక్కపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం, జానకయ్యపేట గ్రామాల్లో బుధవారం నారుమళ్లలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏవో ఉమా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, కొబ్బరి, జీడి మామిడి తదితర పంటల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. సేంద్రియ ఎరువుల తయారీని వివరించారు. నారుమళ్లను పరిశీలించారు. గత రెండువారాలుగా వర్షం లేనందున నారుమళ్ల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు సత్యనారాయణ, సాయి కుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది కొండలరావు, ప్రశాంతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తాసుబాబు, అప్పారావు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్: నారు మడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ తెలిపారు. మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విత్తనాలు చల్లుకునే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. ఎన్ పీఎస్ఎస్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. నారుమడులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ నాగమణి, వ్యవసాయ సిబ్బంది, బాబు, ప్రియాంక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోకులపాడులో ఉచిత వైద్య శిబిరం



ఎస్. రాయవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడులో బుధవారం జనసేన పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. జ్యోతికుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరంలో విశాఖ సురక్ష హాస్పిటల్ వైద్యులు రోగులకు షుగర్, బీపీ పరీక్షలతో పాటు ఈఎన్‌టీ, జనరల్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో స్థానికులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన 130 మంది రోగులు వచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, టీడీపీ నాయకులు అల్లు నరసింహమూర్తి పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయుడు సురేశ్‌ను సత్కరిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్థులు

నక్కపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు ఎంపీపీ-2 పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుడు పిన్నింటి సురేశ్‌కుమార్‌ను బుధవారం ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వేంపాడు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ వెలగా శ్రీనివాసరావు మాట్లాడుతూ..పాఠశాలలో విద్యార్థుల హాజరుపెరగడానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా సురేశ్‌కుమార్ దంపతులను హైస్కూల్ హెచ్‌ఎం బాలాజీ, జనసేన మండలశాఖ అధ్యక్షుడు వెలగా సుధాకర్, ఎస్ఎంసీ ఛైర్మన్ అలబోయిన గోవింద్, వెలగా బాబ్జీ , ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఫల్గుణరావు తదితరులు ఘనంగా సత్కరించారు.

'మెట్టపాలెం వసతి గృహ భవన నిర్మాణానికి కృషి'



వసతి గృహం ఆవరణను పరిశీలిస్తున్న బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిణి శ్రీదేవి

పరవాడ, జూలై 16 (ఆం ధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెంలో గల బీసీ బాలికల వసతి గృహాన్ని బీసీ వెల్ఫేర్ జిల్లా అధి కారిణి శ్రీదేవి బుధవారం సందర్శించారు. వసతిగృహంలో నెలకొన్న సమస్యలను మ్యాట్రిన్ రజినీ ద్వారా తెలుసుకున్నారు. వసతిగృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ ఏడాది మే నెలలో వసతిగృహాన్ని కూల్చివేశారు. ప్రస్తు తం విద్యార్థినులు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో గతంలో నిర్మించిన భవనంలోనే చదువులు సాగిస్తున్నారన్నారు. ఈ కారణంగా వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు మేట్రిన్ వివరించారు. వసతి గృహం నూతన భవన నిర్మాణానికి సింహాద్రి సీఎస్ఆర్ నిధులు రూ.50లక్షలు నిధులు కేటాయించారని, తక్షణమే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె స్పష్టం చేశారు. అంతకుముందు అధికారిణి శ్రీదేవి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. అంతా కష్టపడి చదివి మంచిఫలితాలు సాధించాలని ఆకాక్షించారు.

స్టేషన్ రోడ్డు అభివృద్ధిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి



గాంధీబొమ్మ జంక్షన్ వద్ద సమావేశంలో కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెరుగు బజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు ఉన్న స్టేషన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చిత్తశుద్ధితో ఉన్నారని కూటమి నాయకులు పేర్కొన్నారు. గాంధీబొమ్మ జంక్షన్ వద్ద బుధవారం వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు స్టేషన్ రోడ్డులో పర్యటించి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరించడం తగదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభించినా పూర్తిచేయని వారు ఇప్పుడు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. స్టేషన్ రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే కొణతాల ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆయన చొరవతో టీడీఆర్‌లు కూడా వచ్చాయన్నారు. గతంలో అప్పటి టీపీవోను అడ్డుపెట్టుకొని రోడ్డును వంకర్లు తిప్పి ఎంతమంది వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేశారో విచారణకు సిద్ధమా.. అని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాదంశెట్టి నీలబాబు, బీఎస్ఎంకే జోగినాయుడు, దూలం గోపీ, యల్లంకి సత్తిబాబు, మళ్ల వెంకటరావు, కోట్ని కొండలరావు, పీలా నాగశ్రీను, ఆళ్ల రామచంద్రరావు, మంగ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'కమిటీల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ అన్నారు. బుధవారం తాళ్లపాలెంలో ఏర్పాటు చేసిన పార్టీ మండల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు చేరవేయడంలో విఫలమయ్యారన్నారు. అర్హత ఉన్నా పలువురికి పింఛన్లు అందడం లేదని ఆరోపించారు. ముందుగా ఆయన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగ లక్ష్మి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా, వైసీపీ నాయకులు మలసాల కిశోర్, మళ్ల బుల్లిబాబు, నీటిపల్లి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కూలీల ఆందోళన



ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేపడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

పరవాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆరు వారాల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని ఉపాధి హామీ పథకం కూలీలు తానాం గ్రామంలోని పని ప్రదేశంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల వేతనాలు సకాలంలో చెల్లించకుంటే ఎలా అని ప్రశ్నించారు. కూలీల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి రెండు వందల రోజులు పనిదినాలు కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా జీవో ప్రకారం రోజుకు రూ.309 వేతనం చెల్లించాలని, కూలీలకు పనిముట్లు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు అప్పలనాయుడు, సన్యాసినాయుడు, లక్ష్మి, ముత్యాలయ్య, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నిరంతర అధ్యయనానికి యువత సిద్ధం కావాలి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో నిరంతర అధ్యయనానికి యువత సిద్ధంగా ఉండాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కాండ్రేగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా నరసింగరావుపేటలో బుధవారం ఏర్పాటైన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. జూనియర్ల నుంచి కూడా నేర్చుకునేందుకు వెనుకాడవద్దన్నారు. సృజన, నైపుణ్యాలున్న యువతకు ఏఐ రంగంలో ఉపాధి 68 శాతం పెరుగుతుందన్నారు. అందువల్ల యువత సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుండాలన్నారు. ఈ సదస్సులో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ సంఘటన్ డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు, నైట్ మ్యాన్ పవర్ సొల్యూషన్ లిమిటెడ్ సీఈవో పిళ్లా రమేష్‌బాబు, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరాం తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కేసులు సత్వరం పరిష్కరించుకోండి

▸▸ మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీలో పదో అదనపు జిల్లా జడ్జి నరేష్



అవగాహన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై బుధవారం సాయంత్రం ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు మధ్యవర్తుల సహకారంతో కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. ఇందులో భాగంగానే ఈ అవగాహన ర్యాలీ చేపడుతున్నట్టు చెప్పారు. మెయిన్ రోడ్డులోని కోర్టు సముదాయాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సంతోషిమాత ఆలయ ముఖద్వారం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు పి. నాగేశ్వరరావు, జి.రామకృష్ణ, జి.ధర్మారావు, ఎ.రమేష్, బీవీ విజయలక్ష్మి, నిఖిత సెంగర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా హరశ్రీనివాసరావు, బీవీ రమణ, ఉపాధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, మైఖేల్, మోహనరావు, సుధాకర్, ఎంజేవీఎస్ కుమార్, పలువురు పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తా : జడ్సీ



అంజయ్యకాలనీలో మహిళలతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడి గాంధీనగరం, అంజయ్యకాలనీ, లక్ష్మీనారాయణనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. గాంధీనగరం వద్ద పైప్‌లైన్ లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపట్టాని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంజయ్య కాలనీలో మహిళలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. లక్ష్మీనారాయణ నగర్‌లో పర్యటించిన ఆయనకు పార్కులో సమస్యలను స్థానికులు వివరించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని, పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

సమస్యలపై మునిసిపల్ కార్మికులు వినతి

ఇదిలావుంటే, జీవీఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకుడు కోన లక్ష్మణ ఆధ్వర్యంలో జడ్సీకి వినతి పత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్, క్లాప్ ఆటో డ్రైవర్లు, లోడర్స్, ఆఫీస్ సిబ్బందికి జీవో నంబరు 36 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న డీఏను సత్వరమే అందించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి జగదీష్, నిమ్మకాయల నరసింహమూర్తి, యర్రంశెట్టి అప్పలరాజు, బంగారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి బుధవారం సాయంత్రం కోరారు. ఈ మేరకు ఇక్కడ డీఈవో గిడ్డి అప్పారావునాయుడును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. విద్యామిత్ర కిట్లు అరకొరగా సరఫరా చేయడం వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. అలాగే, ఈ కిట్లను మండల స్టాక్ పాయింట్ నుంచి ఆయా స్కూళ్లకు సొంత ఖర్చులతో చేరవేసిన హెచ్ఎంలకు రవాణా ఖర్చులు వెంటనే మంజూరు చేయాలన్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ తరగతులు బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు నిర్దిష్టమైన టైం టేబుల్ అనుసరించడానికి తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. అలాగే ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల కారణంగా కొత్తగా మంజూరైన పోస్టుల పొజిషన్ ఐడీలు, కేడర్ స్ట్రెంత్ వివరాలను వీలైనంత త్వరగా డీటీవోకు సర్క్యులేట్ చేయాలని కోరారు. ఈ ఏడాది జరిగిన స్పాట్ వాల్యుయేషన్, సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు రెమ్యూనరేషన్ చెల్లించలేదని తక్షణమే విడుదల చేయాలని విన్నవించారు. ఇదిలావుంటే, 36 మంది ఉపాధ్యాయులకు జూన్ నెలజీతాల బిల్లులు సకాలంలో సబ్‌మీట్ చేయడంలో అలసత్వం వహించి జీతాలు రాకపోవడానికి కారణమైన రావికమతం ఎంఈవో-1పై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వాత్సవాయి శ్రీలక్ష్మి, సహోద్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్‌లు ఉన్నారు.

'కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి'



సబ్బవరం మండలం అసకపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. మండలంలోని అంతకాపల్లి, అసకపల్లి, గొల్లలపాలెం, అయ్యన్నపాలెం, బోదువలస, గుల్లేపల్లి గ్రామాల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా పర్యటించారు. పలువురి ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, వంశీదీప్, సాయినాథరావు, ఎం.మహాలక్ష్మీ నాయడు, కరణం రామునాయుడు, గవర అప్పారావు, సత్యనారాయణ, ఆకుల గణేష్, బుదిరెడ్ల కనకరాజు, గంతకోరు సూర్యనారాయణ, దాసరి రమణ, బొండా రాజు, ఎల్లాజీ, అమరపిని నర్శింగరావు, గజ్జి నర్శింగరాజు, వంగలపూడి సంతోష్‌బాబు పాల్గొన్నారు.



గంగిరేవిచెట్టు ప్రాంతంలో మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న సురేంద్ర

గవరపాలెం గంగిరేవిచెట్టు ప్రాంతంలో...

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని గవరపాలెం గంగిరేవిచెట్టు ప్రాంతంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది కాలంలో విజయాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ కొత్త చరిత్ర సృష్టిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మళ్ల సూరిబాబు, సూరిశెట్టి రాజు, పోలిమేర గోపీ, దాడి వాసు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వాడకంతో దుష్పరిణామలు

▸▸ అవగాహన సదస్సులో సీఐ రామచంద్రరావు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

సబ్బవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాకు యువత దూరంగా ఉండాలని సీఐ జి.రామచంద్రరావు సూచించారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాల నియంత్రణపై ఏర్పాటైన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వాడకం వల్ల దుష్పరిణామలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అలాగే, సైబర్ నేరాలు, ఫేక్ లింక్స్, ఓటీపీ స్కామ్‌లు, డేటా భద్రత వంటి వాటిపై అనునిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల భద్రత, చట్టాలపై వివరించారు. మహిళలు వీటిని ఆపద సమయాల్లో సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రత్నప్రకాశ్, ఎంవీ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సంకర జాతి పశువులకు థైలీరియా నివారణ టీకాలు

సబ్బవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో మూడు నెలలు దాటిన సంకరజాతి పశువులకు ఉచితంగా థైలీరియా వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు ఇక్కడి ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ కె.ఉషాకుమారి తెలిపారు. అంతకాపల్లి, బోదివలస గ్రామాల్లో బుధవారం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఆరు వేల డోసులు అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.850 విలువ చేసే ఈ మందును రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మూడు నెలలు దాటిన సంకరజాతి పశువులకు వేస్తున్నట్టు చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కొత్తూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చెట్ల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ కె.రాజశేఖర్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ కారణంగా అనకాపల్లి గాంధీమార్కెట్ సెక్షన్ పరిధిలో ఉన్న రఘురాం కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణ కళాశాల, సత్తెమ్మతల్లి ఆర్చి, గోపాలకృష్ణ థియేటర్ ప్రాంతం, బ్యాంక్ కాలనీ, వైజాగ్ రోడ్డు, డైట్ కళాశాల, కొప్పాక వంతెన ప్రాంతాల్లో, అలాగే, గవరపాలెం ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న నూకాంబిక ఆలయం, చాకలిపేట, ఇందిరమ్మ కాలనీ, రాణిగారి పూలతోట, ఇండోర్ స్టేడియం, అగ్గిమర్రిచెట్టు, కోటవీధిలలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అదేవిధంగా కొండకర్ల 11 కేవీ పరిధిలో ఉన్న హరిపాలెం, అందలాపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగన్నపేట, ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు 11 కేవీ పరిధిలో ఉన్న చినగుములూరు, ఏటికొప్పాక, హెరిటేజ్, చెల్లాపురం జగనన్న కాలనీ, దారాలపూడి గ్రామం, మురగసపల్లి, ఎలమంచిలి మండలం కొక్కిరాపల్లి 11కేవీ పరిధిలో ఉన్న కొక్కిరాపల్లి గ్రామం, మరిబదాయి ఏజీఎల్, అనకాపల్లి డి-2 పరిధిలో ఉన్న మునగపాక ఫీడర్ 11కేవీఏ పరిధిలో బజాజ్‌షోరూం, ఇనపకొట్టు నాగేశ్వరరావు ప్రాంతం, శారదా కాలనీ, ఎల్ఐసీ కార్యాలయ ప్రాంతం, ఉమ్మలాడ రోడ్డు, న్యూ కాలనీ, గర్ల్స్ హైస్కూల్, సత్య థియేటర్, రావుగోపాలరావు కళాక్షేత్రం, ఆర్టీసీ కాంప్లెక్స్, హోండా షోరూం, ఎలమంచిలి మండలం పెదపల్లి 11కేవీ పరిధిలో పెదపల్లి, కొక్కిరాపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, వెంకటాపురం, చిన్న శేకులపాలెం, పెదశేకులపాలెంలలో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. అలాగే ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొండకర్ల 33/11కేవీ పరిధిలో ఉన్న హరిపాలెం, అందాలపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట, పాయకరావుపేట రూరల్ పరిధిలో ఉన్న కుమారపురం, రాజగోపాలపురం, కందియుడి, అరట్లకోట, సత్యవరం, మాగవరం, మాసాహెబ్‌పేట, కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలోని టి.ఎ.రోడ్డు, తిమ్మాపురం, కొనవానిపాలెం, సరిపల్లిపాలెం, కొరుప్రోలు, పెదగుమ్ములూరు, రాంబిల్లి రూరల్ 11కేవీ పరిధిలో ఎలమంచిలిటౌన్, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామరాయుడుపాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందన్నారు.

పరవాడ/లంకెలపాలెం : 79వ వార్డు లంకెలపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. పెదముషిడివాడ, మార్కండేయ కాలనీ, పెదముషిడివాడ హైస్కూల్ ఏరియా, సిద్ధివినాయకనగర్, తులసీనగర్, కన్నూరు, మంత్రిపాలెం, లంకెలపాలెం, వినాయకనగర్, గంజిపేట, శ్రీరామనగర్, గంగిరెడ్ల కాలనీలలో సరఫరా ఉండదన్నారు.

పెచ్చుమీరుతున్న గంజాయి బ్యాచ్ ఆగడాలు

▸▸ ఆందోళన చెందుతున్న గంగునాయుడుపాలెం గ్రామస్థులు



తోటలో గంజాయి బ్యాచ్ వాడి పడేసిన మద్యం సీసాలు, అగ్గిపెట్టెలు

పరవాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి గంగునాయుడుపాలెం నుంచి ముత్యాలమ్మపాలేనికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న జీడి మామిడి తోటలు గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారాయి. ఇక్కడ గంజాయి సేవిస్తూ ఆప్రాంతాలన్నింటినీ అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారు. అగ్గిపెట్టెలు, మద్యం సీసాలతో పాటు లిక్విడ్ గంజాయికి ఉపయోగించే సీసాలు పెద్ద ఎత్తున దర్శనమిస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటితే గంజాయి బ్యాచ్‌లు ద్విచక్ర వాహనాలపై రైడ్ చేసుకుంటూ జీడిమామిడి తోట్లోకి చేరుకుంటున్నాయి. విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎవరైనా నిలదీస్తే వారిపై దాడులకు దిగేందుకు సిద్ధపడుతున్నారు. సుమారు 15 మంది యువకులు బ్యాచ్‌లుగా విడిపోయి గంజాయి సేవిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. దీంతో చీకటిపడితే ఆ రహదారి గుండా రాకపోకలు సాగించాలంటేనే హడలిపోతున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి ఇటువంటి వారి ఆగడాలను అరికట్టాలని గంగునాయుడుపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

డెంగ్యూపై అవగాహన అవసరం




సమావేశాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : డెంగ్యూపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌రావు అన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మాకవరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ఇళ్ల వద్ద ఉన్న నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తే ఇటువంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వివరించారు. జ్వరాలబారిన పడినవారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఎమ్మెల్యేకు వినతి

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి నుంచి తరలించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరుయాదవ్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. డంపింగ్‌యార్డు చుట్టూ నివాస గృహాలు ఉన్నాయని, దుర్వాసనను వారంతా భరించలేకపోతున్నారన్నారు.

'వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి'



బోరు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ శ్రీనివాస్

లంకెలపాలెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి అధికారం చేపట్టిన తర్వాతే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ఇక్కడి నూకాంబిక ఆలయం వద్ద మంచినీటి బోరును బుధవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తనదృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకలు చెలపరెడ్డి రామారావు, దాసరి రామారావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, గుర్రం నాయుడు, దాసరి గంగాధర్, ఉగ్గిన అప్పారావు, సుందరపు దేముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు పర్యటన

అనకాపల్లి కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతుల పరిస్థితి, ప్రభుత్వం వారికి కల్పించిన సౌకర్యాలు, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను అధికారుల ద్వారా తెలుసుకోనున్నారు.

ఏజెన్సీలో వైద్య సదుపాయాలను మెరుగుపరచాలని వినతి



ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌ను కలసిన బీజేపీ నేత ఉమామహేశ్వరావు

కొయ్యూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వైద్య సదుపాయాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరినట్టు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కురుసా ఉమామహేశ్వరావు తెలిపారు. బుధవారం విజయవాడలో బీజేపీ కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి , ప్రస్తుత రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రిని మర్యాద పూర్వకంగా కలసినట్టు చెప్పారు. సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వైద్య ఆసుపత్రుల సదుపాయాలు, సిబ్బంది కొరత తదితర సమస్యలు వివరించామన్నారు. పరిస్థితులు మరింత మెరుగుపర్చేలా మన్యం పర్యటన చేయాలని మంత్రిని కోరినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో జిల్లాలో పర్యటిస్తానని చెప్పారన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి: డీఈవో



డురివిధీలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

హుకుంపేట జూలై 16 (ఆంధ్రజ్యోతి); ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించాలని డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. బుధవారం మండలంలోని మఠం పంచాయతీ డురివిధీ మోడల్ పాఠశాలను ఆయన సందర్శించారు. పిల్లలకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పిల్లలు హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆటపాటల్లో శిక్షణ అందించాలన్నారు. నవోదయ విద్యాలయాల్లో 6 తరగతిలో ప్రవేశానికి పిల్లలను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చెల్లయ్య, హెచ్ఎం నాగేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి



గోమంగి వద్ద కల్వర్టును పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు

పెద బయలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోమంగి సంతబయలు ఆర్ఎండ్‌బీ రహదారి మధ్యలో కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని స్థానికులు జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబును కోరారు. బుధవారం ఆయనకు ఇటీవల అకాల వర్షాలకు రెండు ముక్కలైన కల్వర్ట్‌ను ఆయనకు స్వయంగా చూపారు. దీంతో వంతెన పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పునఃనిర్మాణానికి కృషి చేస్తానని జడ్పీటీసీ సభ్యుడు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు కె. బాలరాజు, కూడా రాధాకృష్ణ, కె. బొంజుబాబు, యువరాజు, ప్రసాద్, కొండబాబు పాల్గొన్నాన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు: డీపీవో



డుంబ్రిగుడలో పరిశీలిస్తున్న డీపీవో చంద్రశేఖర్

డుంబ్రిగుడ, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం ఉదయం సందర్శించారు. ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. దుకాణదారులకు డస్టు బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ పలు వీధుల్లోని పారిశుధ్యం పరిశీలించారు.

జ్వరంతో విద్యార్థికి అస్వస్థత



కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థి

కొయ్యూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లికి చెందిన మర్రిశెట్టి సత్తిబాబు (12) అనే విద్యార్థి జ్వరంతో పాటు ఫిట్స్ రావటంతో సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు పిడుగురాయి కి చెందిన ప్రైవేటు వాహనంలో రాజేంద్రపాలెం పీహెచ్‌సీకు తరలించారు. అక్కడ వైద్యుల సూచనపై నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్ వైద్యులను సంప్రదించి వారి సూచన మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు బాలుడిని తరలింప చేశారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఏటీడబ్ల్యూవో తెలిపారు. సత్తిబాబు ప్రస్తుతం మంప ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదబయలు: స్థానిక సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల చేపడుతున్నందున గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంట వరకు మండలంలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నన్నట్టు ఏఈ పి.వేణుగోపాల్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



చింతపల్లి: మాట్లాడుతున్న గవిరెడ్డి వెంకట రమణ



అరకులోయ మండలం పెదలబుడులో ఎంపికైన గ్రామ కమిటీ

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పాడేరు నియోజకవర్గ సహాయక పరిశీలకుడు వెంకటరమణ

గూడెంకొత్తవీధి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసినట్టు టీడీపీ పాడేరు నియోజక వర్గం సహాయక పరిశీలకుడు గవిరెడ్డి వెంకట రమణ అన్నారు. బుధవారం జీకే వీధి మండలంలో పార్టీ కార్యకర్తలు, గ్రామ కమిటీలతో నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. పింఛన్ నగదు పెంచినట్టు వివరించారు. కుటుంబంలోని ప్రతి పిల్లవానికి తల్లికి వందనం అదించిన ఘనత చంద్రబాబుకి మాత్రమే దక్కుతుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు, నాయకులు పోలుపర్తి గోవింద్, తుడుం సుబ్బారావు, పెదిరెడ్ల బేతాళుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు గంటా నళిని, మాజీ మండలాధ్యక్షుడు ముక్కల రమేశ్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు కీలకం

అరకులోయ: క్షేత్రస్థాయిలో పార్టీకి గ్రామకమిటీలే కీలకమని టీడీపీ మండల అధ్యక్షుడు లకోయి మహదేవ్ అన్నారు. బుధవారం పెదలబుడులో పార్టీ గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శిగా దొర విజయ్‌కుమార్, కార్యదర్శిగా శిరగం భీమదర్, కోశాధికారిగా జగదీశ్వరి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహదేవ్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ కమిటీలు పక్కాగా పనిచేయాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భోయి దా మోదర్, ఉపాధ్యక్షుడిగా పూజారి మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, స్థానిక సర్పంచ్ దాసుబాబు వైస్‌సర్పంచ్ చందూవిజయనిర్మల, మహిళా నాయకులు ద్రౌపతి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి మండలంలో ఏకగ్రీవం

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం, ఎన్‌ఆర్‌పురం, భీంపోల్, చిలకలగెడ్డ పంచాయతీల్లో బుధవారం టీడీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు డి .వెంకటరమణ గ్రామకమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, బిడ్డ లక్ష్మణ్‌రావు, నరేంద్ర, జోగులు, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ల నిర్మాణానికి జాయింట్ సర్వే: కలెక్టర్

పాడేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సెల్ టవర్ల నిర్మాణానికి రెవెన్యూ, ఫారెస్ట్, సెల్ నెట్‌వర్క్‌ల అధికారులు జాయింట్ సర్వే చేసి భూ ములను గుర్తించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో నుంచి అటవీ, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా స్థాయి కమిటీతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సెల్ టవర్ల నిర్మాణాలకు గుర్తించిన భూములపై విధిగా గ్రామ సభ లతీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపించాల న్నారు. నిర్మాణంలో ఉన్న టవర్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. అటవీ ప్రాంతాల్లో జియో 7, బీఎస్ ఎన్ఎల్ 5 సెల్ టవర్ల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలన్నారు. అలాగే గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అరకులోయ డివిజన్ పరిధిలో 30 రహదారులకు, 36 రీచ్‌లకు అటవీ శాఖకు ఫారం- ఏ పంపించినట్టు, 13 పనులకు జా యింట్ సర్వే పూర్తి చేశారన్నారు. అలాగే అటవీ శాఖ ఫారం- బీలో అనుమతులిచ్చారని కలెక్టర్ పేర్కొన్నారు. పాడేరు, నర్సీపట్నం అటవీ డివిజన్‌ల పరిధిలో అటవీ శాఖ అనుమతులకు 15 ప్రతిపాదనలు వచ్చాయన్నారు. వాటికి సర్వే పూర్తి చేసి, వాటికి వెంటనే రహదారి నిర్మాణాలు ప్రారంభిం చాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ అటవీ అధికారి పీవీ.సందీప్‌రెడ్డి,ఇంజనీరింగ్ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈఈ దుర్గాప్రసాద్, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి

సజావుగా టీడీపీ సంస్థాగత ఎన్నిక





జీకే వీధి టీడీపీ మండలాధ్యక్షుడిగా కొండలరావు, ప్రధాన కార్యదర్శి నాగమణి

గూడెంకొత్తవీధి, జూలై 16 (అంధ్రజ్యోతి): టీడీపీ గూడెంకొత్తవీధి మండలాధ్యక్షుడిగా పొత్తూరు కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి నాగమణి ఎన్నికైనట్టు నియోజక వర్గ సహాయక పరిశీలకుడు గవిరెడ్డి వెంకటరమణ తెలిపారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సిరిబాల బుజ్జిబాబు, కొర్ర బలరామ్, పొత్తూరు కొండలరావు పోటీపడ్డారు. కొండలరావు , అధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు సభ్యులు ఎన్నుకున్నారు.

'మృతుల కుటుంబాలను ఆదుకోవాలి'



గడ్డిమర్రిలో చెరువులో పడి మృతి చెందిన కుటుంబాలతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

హుకుంపేట జూలై 16 (ఆంధ్రజ్యోతి); ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన పిల్లలు కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. బుధవారం మండలంలోని గడ్డిమర్రి గ్రామంలో మృతి చెందిన పిల్లలు కుటుంబాలను సంఘ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తవ్వించిన చెరువులో ఈతకు దిగి గెమ్మెలి సంతోష్, గెమ్మెలి అఖిల్ మృత్యువాతపడడం బాధాకరమన్నారు. ఈ కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. హైమవతి, ఉపాధ్యాయుడు టి. కృష్ణారావు, మండల అధ్యక్షులు రామారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రింతాడ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సేవలు అభినందనీయమని స్థానిక హెచ్‌ఎం కె.సుమిత్ర అన్నారు. బుధవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు లోచలి పుష్పలత, ధార, సౌమ్య, సుధావాణి, కొండమ్మ, సీఆర్‌టీ సులోచనలను సహ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సన్యాసిరావు, పాపయమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పొగాకు, గంజాయికి దూరంగా ఉండాలి: సీఐ



విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న అరకు సీఐ హిమగిరి

డుంబ్రిగుడ, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): గంజాయి, పొగాకు తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అరకు సీఐ హిమగిరి అన్నా రు. మండలంలోని కించుమండ ప్రభుత్వ ఆశ్రమ బాలురు పాఠశాలలో సందర్శించిన ఆయన విద్యార్థులకు అవగహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు గెన్ను, సిబ్బంది రాంబాబు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

చింతపల్లి: గిరిజన విద్యార్థినులు పోక్సో చ ట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ వి. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బీఎస్ఎస్ పడాల్, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

ముంచంగిపుట్టు: నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గత రెండు రోజులుగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో కిరాణా, పాన్ షాపేలలో తనిఖీలను నిర్వహిస్తున్నారు. నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేశారు.

గర్భిణీని ఆస్పత్రికి తరలింపులో తంటాలు



అంబులెన్సులో తరలిస్తున్న గర్భిణి

గూడెంకొత్తవీధి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండిన గర్భిణీని ప్రసవం కోసం ఆస్పత్రికి తరలింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆమె ఆస్పత్రికి రావడానికి నిరాకరించడంతో వైద్యసిబ్బంది కౌన్సెలింగ్ చేసి ఒప్పిం చారు. తీరా, అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలో బురదలో వాహనం కూరుకుపోయింది. మూడు గంటల తరువాత ట్రాక్టర్‌తో అంబులెన్సుని బయటకు తీసి ఆమెను ఆర్‌వీనగర్ ఆస్పత్రికి తరలించారు. వివరాలివి.. మండలం, గ్రా మ పంచాయతీబందపాలెంనకు చెందిన గెమ్మెలి శాంతికి నెలలు నిండాయి. దీంతో ఆస్పత్రికి తీసుకువచ్చేందుకు ఏఎన్ఎం మంగబుధవారం గ్రామానికి వెళ్లారు. ఆమె ఆస్పత్రికి రానని, గృహంలోనే ప్రసవం పొందుతానని మారాం చేసింది. దీంతో వైద్య సిబ్బంది ఆమెకు కౌన్సెలింగ్ చేసి అంబులెన్సులో ఆర్‌వీనగర్ ఆస్పత్రికి తీసుకువస్తుండగా మధ్యలో అంబులెన్సు బురదలో కూరుకుపోయింది. దీంతో డ్రైవర్ ట్రాక్టర్‌ని తీసుకువచ్చి అంబులెన్స్ బయటకు తీశారు. అనంతరం గర్భిణీని ఆస్పత్రికి తీసుకుని రాగా వైద్యాధికారి సౌమ్య ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుతో ఉపాధి అవకాశాలు

చింతపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఆచార్య ఎన్‌జీరంగా ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. పదో తరగతి విద్యార్హతతో ఈ కోర్సులో చేరవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, టీచింగ్ అసోసియేట్ శ్వేత పాల్గొన్నారు.

పై కప్పులేని భవనంలో పాఠాలెన్నాళ్లు?

చీడిపల్లిలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

కొయ్యూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల పైకప్పు లేకుండా లేని భవనంలో చిన్నారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని విద్యాకమిటీ చైర్మన్ కొరవంగి లక్ష్మణరావుతో పాటు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. 2015 ఫిబ్రవరిలో ప్రకృతి వైపరీత్యాలతో భవనం పైకప్పు రేకులు శిథిలమైందని. నాటి నుంచి ఏటా పాఠశాల భవనం మరమ్మతులు చేయాలని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా నేటి వరకు స్పందించలేదని వాపోతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 43 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి పాఠశాల భవనం నిర్మించాలని కోరారు. గ్రామ పెద్దలు కొవంగి బుజ్జిబాబు, రాంబాబు, లక్ష్మణరావు, సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



చీడిపల్లిలో శిథిల పాఠశాల భవనంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

తరగతి గదిలోకి వర్షం నీరు

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ సారధి గ్రామంలో పక్కా పాఠశాల భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సత్యారావు, సన్యాసిరావు, మోదొనో, నీలకంఠం తదితరులు మాట్లాడుతూ శిథిలం కావడంతో రేకుల షెడ్‌లో సుమారు 19 మంది విద్యార్థులు చదువుతున్నారు.ప్రస్తుతం చిన్నపాటి రేకుల షెడ్డులో ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు.



సారధి గ్రామంలో పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

డీఆర్ డిపోల్లో రేషన్‌తోపాటు నిత్యావసరాల విక్రయం

జీసీసీ డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్



మాట్లాడుతున్న జీసీసీ డీఎం వెంకటేశ్

చింతపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి):గిరిజన సహకార సంస్థ డీఆర్ డిపోల్లో ఆగస్టు ఒకటి నుంచి రేషన్ బియ్యంతో పాటు నిత్యావసర సరకులు విక్రయించనున్నట్టు స్థానిక డివిజనల్ మేనేజర్ బుక్కా వెంకటేశ్ అన్నారు. బుధవారం జీసీసీ సేల్స్‌మన్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ డీఆర్ డిపోల్లో రేషన్ బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నామని, వచ్చే నెల నుంచి గృహ వినియోగానికి అవసరమైన పప్పులు, ఉప్పు, కారం, నూనె, టీ, కాఫీ పొడి, ఉల్లిపాయలు, బంగాళ దుంపలుతోపాటు కిరాణా దుకాణాల్లో లభించే సరకులన్నీ విక్రయిస్తామన్నారు. గిరిజనులకు నాణ్యమైన నిత్యవసర సరకుల సరఫరాకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు నాణ్యమైన సరకులు డీఆర్ డిపో ద్వారా అందజేస్తామన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు కిరాణా సామగ్రిని డీఆర్ డిపోల్లోనే కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల్లో 56,201 రేషన్ కార్డులకుగానూ పీడీఎస్ 48,560, ఏఏవై 13,641 రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు బియ్యం, పంచదార వేర్వేరుగా కాకుండా నేరుగా అందించాలని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మెనూ అమలు : ఏటీడబ్ల్యూవో



మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

చింతపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మెనూ అమలు చేయాలని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయ నాగలక్ష్మి అన్నారు. బుధవారం ఏటీడబ్ల్యూవో కార్యాలయంలో చింతపల్లి, జీకేవీధి మండలాలకు చెందిన హెచ్‌డబ్ల్యూవో, డిప్యూటీ వార్డెన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ ఆశ్ర మ పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనాలు పెట్టాలన్నారు. మెనూ ఆధారంగా అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు అందించాలని ఆదేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గత ఏడాది పదో తరగతి ఫలితాలు ఆశాజనకంగాలేవని, ఈ ఏడాది పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శతశాతం ఉత్తీర్ణతకు ఇప్పటి నుంచే ప్రణాళికయుతంగా విద్యాబోధన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు పసుపులేటి వినాయకరావు, నూకరత్నం, ఉగ్రంగి గణేశ్వరరావు, తిరుపతిరావు, శ్రీనివాసరావు, పద్మ, డిప్యూటీ వార్డెన్లు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణం వేగవంతం: పీడీ



పూలగొందిలో ఇళ్ల లబ్దిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు నాయక్

జి.మాడుగుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు త్వరితగతిన పూ ర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ బాబు నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని ఆయన సింగర్బ పంచాయతీ మారుమూల పూలగొంది గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 34,265 గృహాలు మంజూరుకాగా, వీటిలో 25,795 మాత్రమే గ్రౌండింగ్ చేశారని తెలిపారు. ఇంకా 8,470 గృహాలకు పనులు ప్రారంభించలేదని చెప్పారు. జన్‌మన్ పథకంలో రూ.45 కోట్లు మంజూరైనట్లు పీడీ స్పష్టం చేశారు. ప్రస్తుతం గృహ నిర్మాణాలకు నిధులు కొరతలేదని, లబ్ధిదారులు వెంటనే వాటి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ డి. ఈశ్వరరావు, సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో యాజమాన్య పద్ధతులతో దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

చింతపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు వరి సాగులో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునని స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) బీవీ తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గాడిదెలమెట్ట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నారు మడులు, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ లేత నారుని పొలాల్లో నాటు కోవాలన్నారు. వరుసల పద్ధతిలో నాటు కోవడం వల్ల గాలి, వెలుతురు తగిలి దిగుబడులుపెరుగుతాయన్నారు. అలాగే పొలాల గట్లు వద్ద కంది పంటను నాటు కోవాలన్నారు. వేరుశనగలో ఎకరానికి 200కిలోల జిప్సం వేసుకోవాలన్నారు. ఏవో మధుసూదనరావు పాల్గొన్నారు.

కె.బెన్నవరంలో తాగునీటి పథకానికి శంకుస్థాపన

చింతపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి పంచాయతీ కె. బెన్నవరంలో రూ.10 లక్షల జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో తాగునీటి పథకం నిర్మిస్తున్నట్టు టీడీపీ మండల కార్యదర్శి ఆండ్రాబు లక్ష్మణ్ తెలిపారు. బుధవారం స్థానిక సర్పంచ్ వంతల మహేశ్వరితో కలిసి ఆయన రక్షిత మంచి నీటి పథకం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

అరకులోయలో వర్షం



అరకులో కురుస్తున్న వర్షం

అరకులోయ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో బుధవారం మ. ధ్యాహ్నం నుంచి సాయం త్రం వరకు మోస్తరు వర్షం పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గత రెండు మూడు రోజులుగా ఎండ కాసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. దీంతో పాఠశాలలు, కళాశాలలు నుంచి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది ఎదుర్కొన్నారు.

చింతపల్లి: మండలంలో తేలికపాటి వర్షం కురిసింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు వర్షం పడింది. వరి, రాగి నారు, చిలకడ దుంప నాట్లకు ఈ వర్షం ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాగా వర్షం వల్ల స్థానిక వారపు సంతలో వినియోగదారులు, వర్తకులు ఇబ్బంది పడ్డారు.

కొయ్యూరులో 36.7 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు: మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి, దీంతో ఏజెన్సీలో బుధవారం కొయ్యూరులో 36.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా అరకులోయలో 34.0, పాడేరులో 33.5, అనంతగిరిలో 32.3, జి.మాడుగులలో 32.2, డుంబ్రిగుడలో 30.7, పెదబయలులో 30.0, చింతపల్లిలో 28.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆ గిరిజన తెగను విస్మరించ లేదు

విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.బాబూరావునాయుడు

పాడేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేశంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఆదివాసీల స్థితిగతులపై తను రాసిన 'ఉనికిని కోల్పోతున్న ఆదివాసీలు' అనే పుస్తకంలో ఓ గిరిజన తెగను ప్రస్తావించలేదనే ప్రచారంలో వాస్తవం లేదని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ టి.బాబూరావునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పుస్తకంలో అన్ని గిరిజన తెగలను ప్రస్తావించానని, అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు గిరిజన తెగలపై జరిగిన ఆర్థికస్థితి గణాంకాల అధ్యయనం ఆధారంగా వృద్ధి చెందిన తెగల వివరాలను పొందుపర్చిన క్రమంలో అందులో లేని తెగలను తను విస్మరించినట్లుగా భావిస్తున్నారని, అది వాస్తవం కాదన్నారు. ఇందులో ఎటువంటి అపోహలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు.

యాంత్రీకరణతో ఎంతో మేలు

దేవరాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎల్.వై. కాంతమ్మ చెప్పారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామంలో బుధవారం వరినాట్లు వేసే యంత్రం ద్వారా నాట్లు వేసే విధానంపై అవగాహన కల్పించారు. బి.కింతాడ, పెదనందిపల్లి, వేచలం, మామిడిపల్లి, ఎ.కొత్తపల్లి, కలిగొట్ల గ్రామాల్లో దాదాపు 150 ఎకరాల్లో యంత్రాల ద్వారా వరి నాట్లు వేసినట్టు చెప్పారు. ఒక ఎకరానికి నాట్లు వేయడానికి రూ.4,500 ఖర్చు అవుతుందన్నారు. రోజుకు ఐదు నుంచి ఆరు ఎకరాల్లో నాట్లు వేయవచ్చని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

చోడవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిపల్లి వ్యవసాయ ఫీడర్ నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జేఈ రాజు తెలిపారు. చాకిపల్లి ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్లపై పడుతున్న చెట్లను తొలగించే పనిని చేపడుతున్నందున అంకుపాలెం, గౌరీపట్నం, శ్రీరాంపట్నం, నరసయ్యపేట గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని రైతులు గమనించి సహకరించాలని జేఈ కోరారు.

చీడికాడలో...

చీడికాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తురువోలు ఫీడర్ పరిధిలోని 11 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈఈ నమ్మి వెంకటరావు బుధవారం తెలిపారు. మండలంలోని చీడికాడ, తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, వింటిపాలెం, చుక్కపల్లి, చెట్టుపల్లి, బైలపూడి, జైతవరం పంచాయతీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ అంతరాయాన్ని ఆయా పంచాయతీల్లోని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ సబ్ స్టేషన్ పరిధిలోని నాలుగు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏఈఈ కర్రి శంకరరావు బుధవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. అలాగే కె.కోటపాడు మండలంలోని ఆనందపురం నుంచి దేవరాపల్లికి సరఫరా చేసే 33 కేవీ లైన్ పనులు అదే రోజు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గొలుగొండలో...

గొలుగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్.ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెంతో పాటు పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా నాయుడమ్మ



నాయుడమ్మ

దేవరాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షురాలుగా అవుగడ్డ నాయుడమ్మ (సత్య వేణి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి పలువురు పోటీ పడినప్పటికీ పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కోకన్వీనర్ దొగ్గ ఈశ్వరరావు, అప్పలకొండ, జీఎస్ నాయుడు తదితరులు మిగిలిన వారిని నచ్చజెప్పి నాయుడమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేశారు. ఈ సందర్భంగా నాయుడమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

గొలుగొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మలేరియా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ సూచించారు. మండలంలోని నిమ్మగెడ్డ, జోగంపేట, గొలుగొండ గ్రామాల్లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివాస పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం నిమ్మగెడ్డ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్నికంలో రెండు పశువుల పాకలు దగ్ధం



మృతి చెందిన గేదె వద్ద రోదిస్తున్న బాధితురాలు

రావికమతం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామంలో కోర్ని బూషబాబుకు చెందిన రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. బూషబాబు ఎప్పటిలాగే సాయంత్రం రెండు చూడి గేదెలను పశువుల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 11.30 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. గ్రామస్థులు, బాధిత రైతు సంఘటనా స్థలానికి వచ్చేసరికే మంటలు చెలరేగి అదుపు చేయడం సాధ్యం కాలేదు. దీంతో రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. ఒక చూడి గెదే మృత్యువాత పడగా, మరో గేదె దాదాపు 90 శాతం గాయపడింది. దీంతో బాధిత రైతు లబోదిబోమని రోదిస్తున్నాడు. అతన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్ఈజెడ్‌కు భూములు ఇచ్చేది లేదు

తెగేసి చెప్పిన రైతులు.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా





తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు... తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కె.కోటపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లి, చింతపాలెం గరుగుబిల్లి, గుల్లేపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఎస్ఈజెడ్‌లకు భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. ఈ మేరకు ఆయా గ్రామాలకు చెందిన రైతులు బుధవారం ఆందోళనక కార్యక్రమం చేపట్టారు. విజయ సినిమా హాల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈజెడ్‌కు భూములు ఇవ్వబోమని తహసీల్దార్‌కు వ్యక్తిగత దరఖాస్తులు సమర్పించారు. తహసీల్దార్ రైతులను ఒప్పించే ప్రయత్నం చేసినప్పటికీ, ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కొంత సమయం పోలీసులకు, రైతులకు మధ్య వాగ్వావాదం జరిగింది. తమకు తెలియకుండా రెవెన్యూ అధికారులు రహస్య సర్వే ఎలా చేస్తారని రైతులు ప్రశ్నించారు.

వీరికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు, ఈర్లే నాయుడుబాబు, గాడి ప్రసాద్ మద్దతు పలికి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌పి పాత్రుడు, రుత్తల గోవిందు, బోళం సూరిబాబు, ఎం.సోమేశ్, తాళ్ల నాగేశ్, తాళ్ల పైడిరాజు, కక్కల యాత నాయుడు, కక్కల నాయుడు, సీమసురు దేముడు, ఎస్.రాము, రుత్తల మంగ, అధిక సంఖ్యలో మహిళలు, రైతులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి, ఆర్డీవో రమణ పర్యవేక్షణ



చమ్మచింతలో రోగులకు పరీక్షలు చేయిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

నాతవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు గ్రామాల్లో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. మండలంలో జ్వరాలు ఎక్కువగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన స్పీకర్ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు చమ్మచింత, మాధవనగరం, గుమ్మిడిగొండ, నాతవరం గ్రామాల్లో శిబిరాలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి, ఆర్డీవో వీవీ రమణ శిబిరాలను పర్యవేక్షించారు. చమ్మచింత గ్రామంలో డీఎంహెచ్‌వో దగ్గరుండి రోగులకు పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమాల్లో డీపీఎంవో డాక్టర్ ప్రశాంతి, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వైద్యులు లత, అనూష, ప్రసన్న, గాడి రమణబాబు, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటరమణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్, నాయకులు చింతకాయల ప్రశాంత్, కాశపు నూకరాజు, అపన్న విజయ్ పాల్గొన్నారు.

'ఇద్దరు వైద్యులనూ రిలీవ్ చేస్తే ఎలా?'

నాతవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యాధులు ప్రబుతున్న సమయంలో ఇద్దరు వైద్యులను రిలీవ్ చేస్తే రోగులకు సేవలు ఎలా అందుతాయని టీడీపీ నాయకుడు అపన్న విజయ్ ప్రశ్నించారు. అల్లూరి జిల్లా నుంచి నాతవరం ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు డాక్టర్లు రావాల్సి ఉండగా, అక్కడ అధికారులు వారిని రిలీవ్ చేయలేదని, వారు రాకుండానే ఇక్కడ వైద్యులను ఎలా పంపించేస్తారని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీ జ్యోతి, ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ వేణుగోపాల్‌ను ఆయన నిలదీశారు. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో డీఎంహెచ్‌వో స్పందించి కొత్త వైద్యులు వచ్చేవరకు ఇక్కడ పనిచేసిన వైద్యులు రాజేశ్‌నాయుడు, ప్రసన్నలను వెనక్కి రప్పించి రోగులకు సేవలు అందించాలని కోరారు.

'మోసాలకు ప్రతి రూపం వైసీపీ'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రొంగలి మహేశ్

కె.కోటపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మోసాలకు ప్రతి రూపం వైసీపీ అని రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ రొంగలి మహేశ్ దుయ్యబట్టారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలను లూటీ చేసి మోసపు మాటలతో పరిపాలన సాగించిన వైసీపీ, ఇప్పుడు బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే పెన్షన్ల పెంపు, దీపం పథకం, తల్లికి వందనం అమలు చేస్తున్నామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారని చెప్పారు. మేనిఫెస్టోలో ప్రకటించినవే కాకుండా అన్న క్యాంటీన్, డీఎస్సీ నిర్వహణ, విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం తదితర కార్యక్రమాలు వైసీపీ నాయకులకు కనిపించడం లేదా ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రతీ కార్యకర్తకు ఎంతో విలువ ఉంటుందన్నారు. వైసీపీ మోస పూరిత మాటలను ఎప్పటికప్పుడు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.రాము నాయుడు, పూడి నారాయణమూర్తి, జె.రాము, కె.అప్పలనాయుడు, సిహెచ్.రామారావు, రుద్ర ఈశ్వరరావు, పూడి శ్రీను, వంటాకు శ్రీను పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చుకోండి

▸ ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్



కొత్తకోటలో సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పిస్తున్న ఏఈ

రావికమతం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులు ఇళ్ల పై కప్పులకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌లను అమర్చుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కొత్తకోటలో సర్పంచ్ కోన లోవ రాజు అధ్యక్షతన బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా జల, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెరగడం సాధ్యం కాదన్నారు. అందువల్ల ప్రభుత్వం ముందు చూపుతో సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వమే రాయితీలు అందిస్తున్నదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగాను, ఓసీ, బీసీ, ఇతర వర్గాలకు 50 శాతం రాయితీపై యూనిట్లు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పందల దేవ, టీడీపీ నాయకులు కోట గోవిందరావు, ఉగ్గిన శ్రీను, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు థైలీరియా టీకాలు

▸ పశు సంవర్ధక శాఖ ఏడీ చిట్టినాయుడు

మాడుగుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ఏరియా పశు వైద్యశాల పరిధిలోని మండలాల్లో సంకరజాతి పశువులకు ఉచితంగా థైలీరియా వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు తెలిపారు. మాడుగుల మండల కేంద్రంతో పాటు పలుచోట్ల బుధవారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీడికాడ మండలానికి 3,600 డోసులు, మాడుగుల మండలానికి సంబంధించి 5,400 డోసులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పాడి రైతులంతా మూడు నెలలు ఆడ, మగ సంకరజాతికి చెందిన పశువులకు ఈ టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఆయన సూచించారు. రూ.850 విలువ చేసే ఈ టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదన్నారు. ఇప్పటివరకు చీడికాడ మండలంలో 11,060 పశువులకు టీకాలు వేసినట్టు ఆయన చెప్పారు.

'నిరంతర అధ్యయనానికి యువత సిద్ధం కావాలి'

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో నిరంతర అధ్యయనానికి యువత సిద్ధంగా ఉండాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కాండ్రేగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా నరసింగరావుపేటలో బుధవారం ఏర్పాటైన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. జూనియర్ల నుంచి కూడా నేర్చుకునేందుకు వెనుకాడవద్దన్నారు. సృజన, నైపుణ్యాలున్న యువతకు ఏఐ రంగంలో ఉపాధి 68 శాతం పెరుగుతుందన్నారు. అందువల్ల యువత సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుండాలన్నారు. ఈ సదస్సులో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ సంఘటన్ డిప్యూటీ డైరెక్టర్ గొర్లి మహేశ్వరరావు, నైట్ మ్యాన్ పవర్ సొల్యూషన్ లిమిటెడ్ సీఈవో పిళ్లా రమేష్‌బాబు, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరాం తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

జిల్లా పంచాయతీ అధికారి సందీప్



విలేకరులతో మాట్లాడుతున్న డీపీవో

నాతవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించినట్టు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా సమన్వయ అధికారి నాగలక్ష్మితో కలిసి బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కాలువల్లో మరుగునీరు నిల్వ ఉండకూడదని కార్యదర్శులకు సూచించినట్టు చెప్పారు. అలాగే దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా చెత్త నిల్వ ఉంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను చైతన్యపరచాలని, బ్లీచింగ్ పౌడర్ జల్లాలని, తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించి నట్టు ఆయన తెలిపారు. అలాగే జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని పరీక్షలకు పంపించాలని డీపీవో కోరారు.

శ్రమదానంతో కాలువల్లో పూడికతీత



రైవాడ కాలువలో పూడికలు తొలగిస్తున్న రైతులు

దేవరాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం కుడి కాలువ కింద ఆయకట్టు రైతులు బుధవారం శ్రమదానంతో పూడిక తీసుకున్నారు. కాలువలో పూడిక తీయడానికి రైతులంతా దండుగా కదిలారు. సాగునీటి కాలువలకు శ్రమదానం జోడించి చకచకా పనులు ప్రారంభించారు. ఈ కాలువ కింద కలిగొట్ల, బి.కింతాడ, తిమిరాం గ్రామ రైతులు జలాశయ చైర్మన్ పాత్రునాయుడు ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఆయా గ్రామాలకు చెందిన నాలుగు వేల ఎకరాలు ఆయకట్టు నీరు అందించే ఈ కాలువ ఆరు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ కాలువలో పూడికపోయిన తుప్పలు, డొంకలు తొలగించి నీటి ప్రవాహానికి రైతులు మార్గం సుగమం చేసుకున్నారు.

మేడివాడలో హైవోల్టేజీతో విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

రావికమతం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ గ్రామంలో మంగళవారం రాత్రి హైవోల్టేజీ వంద గృహాలకు పైగా వినియోగంలో ఉన్న విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామంలో తాతయ్య ఆలయం వద్ద విద్యుత్ తీగలపై కొబ్బరి మట్ట పడడంతో ఎస్ఎస్ వన్ ట్రాన్స్‌ఫార్మర్ న్యూట్రల్ వైర్ తెగిపోయింది. దీంతో హైవోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో ఆంజనేయస్వామి ఆలయం వెనక భాగంలోని ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాన్ని గుర్తించిన విద్యుత్ సిబ్బంది తెగిన వైర్‌ను సరి చేయడంతో బుధవారం యథావిధిగా విద్యుత్ సరఫరా జరిగింది.

సొసైటీని లాభాల బాట పట్టిస్తా..

కె.కోటపాడు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి చీపురుపల్లి రామారావు

కె.కోటపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడిపిస్తానని పర్సన్ ఇన్‌చార్జిగా నియమితులైన చీపురుపల్లి రామారావు అన్నారు. బుధవారం కె.కోటపాడు పీఏసీఎస్‌లో త్రీ మన్ కమిటీగా నియమితులైన పర్సన్ ఇన్‌చార్జి రామారావు, సభ్యులు రుద్ర ఈశ్వరరావు, దొగ్గ వెంకటరావు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తమపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవికి సిఫారసు చేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు జూరెడ్డి రాము, కశిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డాదిలో మరిడిమాంబ పండుగ



బుచ్చెయ్యపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో కొలువైన మరిడిమాంబ అమ్మవారి పండుగను గురువారం నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. గ్రామంలో వివిధ ప్రాంతాల కళాకారులతో భారీ ఎత్తున నేల వేషాలు, పులి వేషాలు, బాణసంచా కాల్పులుతో పాటు ఘటాలు ఉరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పెదమదీన-చింతపాక రోడ్డుకు మోక్షం

బుచ్చెయ్యపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమదీన-చింతపాక రహదారికి మోక్షం లభించింది. పరమ అధ్వానంగా ఉన్న ఈ రోడ్డుతో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు, వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. ఈ సమస్యను చింతపాక కూటమి నాయకులు ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాజు అధికారులతో మాట్లాడారు. ఫలితంగా బుధవారం సంబంధిత అధికారులు వచ్చి రోడ్డు కొలతలు తీసి అంచనా తయారు చేస్తున్నారు. త్వరలో ఈ రోడ్డుకు మోక్షం కలుగుతుందని వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కలిమి శ్రీను, కోట్ని లక్ష్మణరావు, సిగిరెడ్డి సత్యారావు, సలాది అప్పారావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

కె.కోటపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా సేవాదళ్ కో-ఆర్డినేటర్ కన్నూరు అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 90 మంది కంటి రోగులకు వైద్యులు తగిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. వీరిలో 56 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి బస్సుల్లో తరలించారు. ఆసుపత్రికి చెందిన ఆరుగురు కంటి వైద్య నిపుణులతో పాటు ఆరుగురు సత్యసాయి సేవా సభ్యులు సహాయ సహకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కె.కోటపాడు కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోవడానికి...

కుటుంబ సభ్యులు, స్నేహితుడితో కలిసి ఫౌండేషన్ ఏర్పాటు

- ప్రభుత్వ కళాశాలల్లోని 209 మంది పేద విద్యార్థులకు రూ.15 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేత
- కెనడాలో స్థిరపడిన ఓ యువకుడి ఉదారత
- ఉన్నత స్థానానికి చేర్చేది చదువే
- ఆర్థిక స్థోమత లేదని వెనుకాడవద్దంటున్న రోహన్ చెర్ల

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): **సాధారణంగా యుక్త వయస్సు వారంతా తల్లిదండ్రులను తమకు ఏం కావాలో అడిగి వాటిని కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతుంటారు. మరికొందరు తమకు నచ్చిన సెల్‌ఫోన్, ట్యాబ్, లేదా సైకిల్‌వైపు మొగ్గుచూపుతారు. అయితే కెనడాలో ఉంటున్న జగన్నాథ భాస్కర రోహన్ చెర్ల మాత్రం ఇందుకు భిన్నంగా నిలిచాడు. తల్లిదండ్రులు విశాఖ ప్రాంతానికి చెందినవారు కావడంతో ఏడాదిలో ఒక్కసారి జన్మభూమిపై మక్కువతో వస్తుండేవారు. ఇదే సమయంలో 16 ఏళ్ల ప్రాయంలో రోహన్ చెర్లకు కలిగిన సందేహాన్ని తల్లి చెవిలో వేశాడు.**

నేను, నా స్నేహితులందరూ అక్కడ (కెనడా) చదువుకోవడం, ఆడుకోవడం చేస్తుంటాం కదా! మరి ఇక్కడ (భారత్‌లో) ఎందుకు పనులు చేస్తున్నారని అడిగాడు. మన దేశంలోని ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులను తల్లి చెప్పడంతో రోహన్ చెర్ల ఆలోచనలో పడ్డాడు. దీంతో మరుసటి ఏడాది తనకు ఇంట్లో ఇచ్చిన పాకెట్‌మనీ, ఇతరత్రా డబ్బులను జాగ్రత్తగా దాచాడు.

విశాఖ జిల్లాలో చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారిని ఆదుకుంటానని చెప్పడంతో తల్లిదండ్రులు సంతోషంతో ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలో తనతో పాటు తల్లి, అమ్మమ్మ, కెనడాకు చెందిన తన మిత్రుడు జోసెఫ్‌తో కలిసి జేబీ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశాడు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల ఫీజును స్కాలర్‌షిప్‌ల ద్వారా అందించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న విధంగా 2023లో స్థాపించిన జేబీ ఫౌండేషన్ ద్వారా 209 మంది విద్యార్థినీ, విద్యార్థులతో (ఏవీఎన్, బీవీకే, ప్రభుత్వ మహిళా కళాశాలలు) ముఖాముఖి నిర్వహించి వారికి రూ.15 లక్షల స్కాలర్‌షిప్‌ను అందజేశారు.



నగరంలోని వివిధ ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న రోహన్‌చెర్ల

అందరూ చదువుకోవాలి



కెనడాలోని ప్రతి ఒక్కరూ చదువుకుంటారు. ఆడుకుంటారు. కానీ మన దేశంలో అలా ఎందుకు లేదో తెలియదు. చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సహాయం చేయాలని నిర్ణయించుకున్నా. ఈ నేపథ్యంలో నిరుడు తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్‌మనీతో కొంత మందికి స్కాలర్‌షిప్‌ను అందజేశాం. అయితే చదువుకుంటూనే తాను కళాశాలలోని చారిటీ షో చేయడం ద్వారా కొన్ని డాలర్లు ఫౌండేషన్‌లో జమ చేశా. అనంతరం సహాయాన్ని అందించాలని నిర్ణయించుకోవడంతో పాటు ఈ ఏడాది మాత్రం ప్రభుత్వ కళాశాలలో స్వయంగా ఇంటర్వ్యూ చేసి ఎవరికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి వారందరికీ సహాయాన్ని స్కాలర్‌షిప్ రూపంలో తన స్నేహితుడు జోసెఫ్‌తో కలిసి అందజేశాను. ఎట్టిపరిస్థితుల్లోనూ చదువు ఆపకూడదని, చదువు ద్వారా వ్యక్తిగతంగా ఎవరి కాళ్లపై వారు బతికే అవకాశం ఉంటుందని చెప్పాను. ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ సహాయం చేసేందుకు ముందుకు వస్తే పేద విద్యార్థులందరూ చదువుకోవచ్చు. భవిష్యత్‌లోనూ ఈ సేవలు కొనసాగిస్తాను.

రోహన్ చెర్ల,
జేబీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

మంచి పనులకు సహకారం



తమ కుమారుడు స్వదేశానికి సేవలందించడం చాలా సంతోషంగా ఉంది. తనకు వచ్చిన ఆలోచనను ప్రోత్సహించడంలో తల్లిదండ్రులుగా తాము ఎప్పుడూ ముందుంటాం. జీవితంలో చదువుకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి భవిష్యత్ ఏర్పడుతుంది. దీంతో పాటు స్వదేశానికి కూడా సేవలు అందించేందుకు అందరూ ముందుకు వస్తే మరింతగా పేదవిద్యార్థులకు చేయూత ఇవ్వవచ్చు. తన కుమారుడు రోహన్‌తో పాటుగా జోసెఫ్‌ను కూడా ఇందులో భాగస్వామ్యం కావడం చాలా సంతోషకరంగా ఉంది.

-సాయి హిరణ్మయి, రోహన్‌చెర్ల తల్లి

స్ఫూర్తిదాయకం



అతి చిన్న వయస్సులోనే జేబీ ఫౌండేషన్ ద్వారా స్వదేశానికి సేవలందిస్తున్న రోహన్ చెర్ల, జోసెఫ్‌లు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రభుత్వ కళాశాలలో ఫీజులు తక్కువగా ఉంటాయి. అవి కూడా చెల్లించుకోలేని వారిని స్వయంగా గుర్తించి స్కాలర్‌షిప్‌ను అందజేయడం అభినందనీయం. కెనడాలో స్థిరపడినప్పటికీ స్వదేశానికి మంచి చేయాలనుకోవడం, అందులోనూ చదువుకునేందుకు సహకరించడం గొప్పవిషయం.

- రజని, అధ్యాపకురాలు, ఏవీఎన్ కళాశాల

వేతనాల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన పోస్టుల్లోకి వచ్చిన వారికి మాత్రమే జీతం కోసం పొజిషన్ ఐడీ రావాల్సి ఉంటుంది. దీనిని కొన్ని మండలాల విద్యాశాఖాధికారులు పరిగణనలోకి తీసుకోకపోవడంతో జూన్ నెల జీతం బిల్లు పెట్టలేకపోయారు. ఒక నెల జీతం నిలిచిపోతే తరువాత నెల రెగ్యులర్ జీతాల బిల్లులతో పెట్టేందుకు వీలులేదు. ఆగస్టు నెల తొలి వారంలో సప్లిమెంటరీ బిల్లుల అప్‌లోడ్ సమయంలోనే తిరిగి బిల్లు పెట్టాలి. అంటే అందరికీ పొజిషన్ ఐడీలు వచ్చి ఆగస్టు తొలి వారంలో సప్లిమెంటరీ బిల్లుగా అప్‌లోడ్ చేస్తే సెప్టెంబరు ఒకటో తేదీన జూన్, జూలై నెల జీతాలు వస్తాయని టీచర్లు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యా శాఖ, ఖజానా శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో జీతాలు సకాలంలో అందుకోలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

సబ్బవరంలో రెండు నర్సింగ్ కళాశాలల గుర్తింపు రద్దు

సబ్బవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రెండు నర్సింగ్ కళాశాలల గుర్తింపు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నంలోని 1 బోన్స్ అండ్ జాయింట్ ఆసుపత్రి యాజమాన్యం సబ్బవరంలో నైటింగేల్, ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాలలకు తమ వైద్యశాలలో అటాచెమెంట్ అనుమతి పొందలేదని, విద్యార్థులకు తాము ఎటువంటి శిక్షణ ఇవ్వలేదని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఆయా కళాశాలల నకిలీ పత్రాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ అంశంపై సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టగా.. నైటింగేల్ కళాశాల తమ విద్యార్థులకు 'క్యూ 1 ఆసుపత్రి', కమల నర్సింగ్ హోమ్‌లలో క్లినికల్ శిక్షణ ఇప్పించినట్టు, ఫ్లోరెన్స్ కళాశాల విశాఖ కేజీహెచ్‌తో పాటు 'క్యూ 1 అసుపత్రి'లో శిక్షణ ఇప్పించినట్టుగా ప్రభుత్వానికి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్టు తేలింది. దీంతో ఈ రెండు కళాశాలల గుర్తింపును ప్రభుత్వం మంగళవారం రద్దు చేసింది. ఆయా కళాశాలల్లో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను గుర్తింపు పొందిన ఇతర కళాశాలల్లో చేర్చాలని ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను ప్రభుత్వం ఆదేశించింది.



సబ్బవరంలో నైటింగేల్, ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాలలు నడుపుతున్న భవనం

విద్యార్థులకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించాం..

ఈ విషయమై కళాశాలల డైరెక్టర్ వసుంధరను వివరణ కోరగా, తమకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. తమపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదుల మేరకు ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థుల కోర్సులు పూర్తయ్యేవరకూ అవకాశం కల్పించాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిపారు.

స్వయం ఉపాధి పథకాల మంజూరుకు ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వయం ఉపాధి పథకాలు మంజూరుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ, బ్యాంకు రుణాల మంజూరుపై బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతులు, పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ డెయిరీలు, పౌల్ట్రీ రంగాలకు, స్వయం ఉపాధి బృందాలకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో బ్యాంకర్లు లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. వ్యవసాయం, పౌల్ట్రీ, డెయిరీ రంగాల వృద్ధి 17 శాతం రావాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకర్లు ఆయా రంగాలకు ప్రాధాన్యం ఇచ్చి, రుణాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలు, రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ జితేంద్రకుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీవో రాజేశ్‌కుమార్ కుంద్, నాబార్డు డీడీఎం సమంత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, మెప్మా పీడీ సరోజిని, జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, పశు సంవర్ధక శాఖ జేడీ రామ్మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

కరుణించిన వరుణుడు

... 5వ పేజీ తరువాయి

కురిసింది. ఉష్ణతాపంతో అల్లాడిపోయిన ప్రజానీకానికి మధ్యాహ్నం మూడు గంటలకు సుమారు గంట పాటు కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఈ వర్షం వల్ల పంటలకు మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లిలో...

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పట్టణంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు 36.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. దీనికితోడు ఉక్కపోత ఉండడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది. ఐదు గంటల సమయంలో వర్షపు చినుకులు పడడంతో పాటు చల్లని గాలులు వీయడంతో ప్రజలు ఉపశమనం పొందారు.



అనకాపల్లిలో జోరు వాన

రావికమతంలో..



కె.కోటపాడులో వర్షం పడుతున్న దృశ్యం

రావికమతం: మండలంలో బుధవారం కురిసిన వర్షం వరి నారుకు ఊపిరి పోసింది. వర్షాకాలమే అయినా గత మూడు వారాలుగా వాన జాడ లేదు. వరి విత్తనాలు మొలక వచ్చినప్పటికీ తగినంత తేమ లేక ఎండల తీవ్రతకు భూమి బీటలు వారుతోంది. దీంతో వరి నారు ఎండిపోయే స్థితికి రావడంతో రైతులు ఎండిపోతున్న వరి నార్లుకు గత ఐదారు రోజులుగా తడులు వేస్తూ కాపాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తకోట నుంచి కల్యాణపులోవ రిజర్వాయర్ వరకు పది పంచాయతీల పరిధిలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ఆ ప్రాంతంలో ఎండిపోతున్న వరి నారు మళ్లకు ఊపిరిపోసినట్టయింది.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తేలికపాటి వర్షం కురిసింది. దీంతో వాతావరణం కొంత చల్లబడింది. వారం రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిన జనం ఊరట చెందారు.

క్రైం... crime news

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



నిందితుణ్ని అరెస్టు చేసిన పోలీసులు

అనకాపల్లి టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు గ్రామంలో జరిగిన రెండు చోరీలకు సంబంధించి నిందితుడ్ని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తూరు గ్రామం మద్దాల వారివీధిలోని ఎదూరి తులసీరాణి ఇంట్లో గత నెల 23వ తేదీన చోరీ జరిగిందన్నారు. ఈ చోరీలో 51.5 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఈ నెల 10వ తేదీన రాత్రి కొత్తూరు గ్రామం మెయిన్‌రోడ్డులో మోసూరి వెంకటలక్ష్మి నివాసంలో జరిగిన చోరీలో 17 గ్రాముల బంగారం పుస్తెలతాడు అపహరణకు గురైందన్నారు. అదే ప్రాంతంలో నివాసముంటున్న ఎస్.రాయవరం మండలం కోనవారిపాలెం గ్రామానికి చెందిన కోన రాకేశ్‌పై అనుమానం రావడంతో, ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఎట్టకేలకు నిందితుడ్ని రామాపురం కాలనీకి సమీపంలోని ఏలేరు కాలువ వద్ద పట్టణ ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్ అరెస్టు చేశారన్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు. నిందితుడి అరెస్టుకు సహకరించిన పోలీసు సిబ్బంది ఎం.సముద్రం, ఆర్‌పీ నాయుడు, టి.సంతోశ్‌కుమార్, వై.రామ్మూర్తిని ఆయన అభినందించారు.

కంచరపాలెంలో రౌడీషీటర్ ఆత్మహత్య

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పరిధి తుమ్మడిపాలెంలో నివాసం ఉంటున్న రౌడీషీటర్ గుణశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐటీఐ జంక్షన్ సమీపంలో గల తుమ్మడిపాలెం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ కోలాటి గుణశేఖర్ (28), పిడుగు వసంతతో సహజీవనం చేస్తున్నాడు. వసంతపై కూడా కంచరపాలెం స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో గుణశేఖర్ తుమ్మడిపాలెంలో గల ఇంటికి వచ్చి వసంతతో కాసేపు మాట్లాడుకుని వేరే గదిలో పడుకుంటానని చెప్పి గడియ పెట్టుకున్నాడు. కొద్ది సమయం తరువాత గదిలో నుంచి శబ్దం వినిపించడంతో వేరే గదిలో ఉన్న వసంత వెళ్లి చూడగా ఫ్యాన్‌కు గుణశేఖర్ వేలాడుతున్నట్టు గుర్తించి పెద్దగా కేకలు వేసి చుట్టుపక్కల వారిని పిలిచింది. వెంటనే వారు గడియ పగులగొట్టి గుణశేఖర్‌ను కిందకు దించి 108కి సమాచారం అందించారు. ఆ వాహన సిబ్బంది వచ్చి పరీక్షించి చూడగా అప్పటికే గుణశేఖర్ మృతిచెందినట్టు తెలిపారు. కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందగా రాత్రి విధుల్లో ఉన్న ఎస్ఐ రవికుమార్ మృతదేహాన్ని పరిశీలించారు.బుధవారం తెల్లవారుజామున పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గుణశేఖర్ ఆత్మహత్యకు అప్పులు, ఆర్థిక సమస్యలే కారణమై ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు. కంచరపాలెం సీఐ కె.రవికుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు, జరిమానా

విశాఖపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల కఠిన కారాగారం, రూ.25 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు అదనంగా సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. బాలికకు రూ.1.25 లక్షలు పరిహారంగా ప్రభుత్వం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలిలా ఉన్నాయి.. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న ఇందానా సూర్యప్రకాష్ (19), తన ఇంటి సమీపాన ఉంటున్న బాలిక(8)ను చాక్లెట్లు ఇస్తానని ఇంటికి పిలిచి బాలికను శారీరకంగా హింసించాడు. బలవంతంగా లైంగిక దాడికి యత్నించాడు. బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. బాలికపై లైంగిక దాడి యత్నం జరిగిందని వైద్యులు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన 2021 ఆగస్టులో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం పోక్సో న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

ఓ హోటల్ టీ మాస్టర్‌గా గుర్తింపు

పెందుర్తి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లోని ఓ హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేసిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెందుర్తి సీఐ కేవీ సతీశ్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన శ్రీవర్ధన్‌సింగ్ (58) ఉపాధి కోసం విశాఖ వచ్చాడు. ఈ క్రమంలో పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లోని ఓ కేఫ్‌లో నెలరోజుల క్రితం టీ మాస్టర్‌గా చేరాడు. అతడు మద్యం తాగి పనిలోకి రావటంతో హోటల్ యజమాని సన్యాసిరావు పనివేళల్లో ఇది సరికాదని మందలించాడు. హోటల్ నిర్వాహక సిబ్బందితో కలసి ఓ ఫ్లాట్‌లో ఉంటున్నాడు. మంగళవారం వ్యాపారం లేకపోవడంతో విశ్రాంతి తీసుకుంటానని చెప్పి సిబ్బంది బస చేస్తున్న ఫ్లాట్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి సిబ్బంది ఉంటున్న మొదటి అంతస్తు ఫ్లాట్ నుంచి ఓ వ్యక్తి పడి తలకు తీవ్రగాయాలయ్యాయని భవన వాచ్‌మన్ హోటల్ యజమాని సన్యాసిరావుకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న యజమాని కింద పడిన వ్యక్తి టీ మాస్టర్ శ్రీవర్ధన్‌సింగ్‌గా గుర్తించారు. వెంటనే వైద్యంకోసం 108కి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి వైద్య పరీక్ష చేసి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సతీశ్‌కుమార్ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మద్యం తాగిన మత్తులో ప్రమాదవశాత్తు ఫ్లాట్ నుంచి జారిపడ్డాడా? లేదా ఇతర కారణాలు ఉన్నాయా? అన్న కోణంలో విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఆధార్‌కార్డు తప్ప ఇతర వివరాలు ఏవీ తెలియరాలేదని కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.

గోవా గవర్నర్‌గా అశోక్ నియామకం హర్షణీయం

... 5వ పేజీ తరువాయి

ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన దగ్గర నుంచి ఆయనతో కలిసి పని చేశామని తెలిపారు. మంచి సూచనలు, సలహాలు ఇస్తూ మార్గదర్శకులుగా ముందుండి నడిపించారన్నారు. ప్రస్తుత పరిస్థితులలో అన్ని రాజకీయ పార్టీలు గౌరవించడం ఆయన నిజాయతీ, నిబద్ధత, క్రమ శిక్షణకు అద్దం పడుతోందని కొనియాడారు. గవర్నర్‌గా అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్రమోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ నియోజకవర్గ ప్రజలు ఆయనకు అండగా నిలబడడం అభినందనీయమని అన్నారు.

ఎలమంచిలికి రూ.109 కోట్లు

... 5వ పేజీ తరువాయి

చేయాలని కొక్కిరాపల్లి కౌన్సిలర్ రామకృష్ణ మంత్రికి వినతి పత్రం అందజేశారు. స్థానిక సమస్యలపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ వినతి పత్రం ఇచ్చారు. అనంతర మంత్రి నారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలం భవానీ, జగన్నాథం, రాజాన రమేశ్‌కుమార్, లాలం కాశీనాయుడు, కె.సాయికృష్ణ, కొలుకులూరి విజయ్‌బాబు, ఆడారి మంజు, కొఠారు సాంబ, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఆడారి ఆదిమూర్తి, రాజాన వెంకునాయుడు, కరణం రవి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	73.00
లైవ్ ధర	93.00
విత్ స్కిన్	156.00
స్కిన్ లెస్	166.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544